

నిందితులను కఠినంగా శిక్షించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: పెద్దపల్లిలో డాక్టర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ ఐఎంఏ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు, హాస్పటల్స్‌పై దాడుల నిరోధక చట్టం కింద కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత చట్టంలోగల శిక్షను ఏడు సంవత్సరాలకు పెంచాలని, అందుకు చట్టాల్లో మార్పులు తీసుకురావాలని తీర్మానించారు. సమావేశంలో డాక్టర్లు రవీంద్రరెడ్డి, బీఎన్ రావు, అశోక్‌రెడ్డి, బాలరాజు, ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు పొలాస రాంకిరణ్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, విజయ్‌మోహన్‌రెడ్డి, తిరుపతిరావు, శ్రీలత, మోహన్‌రెడ్డి, నరేష్, కిషన్, జగన్‌మోహన్‌రావు, పెద్దపల్లి అధ్యక్షుడు రమాకాంత్, కార్యదర్శి ప్రణీత్, వెంకటేశ్వర్‌రావు, విజయ, శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రుల కమిటీని ఉపసంహరించుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీని ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ నల్లల కనకరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అమలుకు మంత్రుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని భావిస్తున్నామన్నారు. ఈ మంత్రుల కమిటీ వల్ల మాల, ఉప కులాలకు ఏమాత్రం న్యాయం జరగదన్నారు. ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన కమిటిలో రెడ్డి, మాదిగ, ఎస్టీ, బీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారని, మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కమిటీని స్వాగతించడంలేదన్నారు. మంత్రుల కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తితో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీల జనాభా లెక్కలు సేకరించాలన్నారు. సమావేశంలో సమితి నాయకులు మొగురం రమేశ్, దాసరి దశరథం, అంబటి నర్సింగరావు, మండిగం మాణిక్యరావు, మధునాల రవీందర్, మద్దుల రాజేందర్, హనుమాండ్ల రాజమల్లు, గొట్టే దేవేందర్, మందాల మహేందర్ పాల్గొన్నారు.



సిద్ధంగా ఉన్న నిమజ్జన సామగ్రి



గణేశ్ నిమజ్జనోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- చింతకుంట, మానకొండూర్, కొత్తపల్లిలో పాయింట్లు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నగరపాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం గణేశ్ నిమజ్జనోత్సవాలను శాంతియుతంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఎల్ఎండి, ఎస్సారెస్పీ, కొత్తపల్లి చెరువు అలుగుపారుతున్నందున పోలీసు, నగరపాలక సంస్థ పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. నగరంలోని 60 డివిజన్లలో ఏర్పాటు చేసిన మూడు వేలకుపైగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్, మానకొండూర్, కొత్తపల్లి చెరువుల వద్ద అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్ నిమజ్జనం చేసే ప్రాంతాలను సందర్శించి పలు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయి అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టవర్‌సర్కిల్, మంకమ్మతోట రాంనగర్, కొత్తపల్లి, మానకొండూర్ వద్ద స్వాగత వేదికలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



మానకొండూర్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి (ఫైల్)

నిమజ్జనం పాయింట్ల వద్ద భారీ క్రేన్లు

నగరంలో 1000 నుంచి 1500కు పైగా భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడంతో వాటిని నిమజ్జనం చేసేందుకు నిమజ్జనం పాయింట్ల వద్ద భారీ క్రేన్లను అందుబాటులో ఉంచేందుకు నగరపాలక సంస్థ గతంలో కొనుగోలు చేసిన యంత్రాలను సిద్ధం చేస్తున్నది. చింతకుంట కెనాల్, మానకొండూర్, కొత్తపల్లి చెరువుల వద్ద ఇరువైపులా హైమాస్ట్ లైట్లను, జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు బారీకేడింగ్‌తో పాటు గజ ఈతగాళ్ళను, డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విగ్రహాలను తరలించే వాహనాలను పార్కింగ్ చేసి క్యూ పద్ధతిలో విగ్రహాలను నిమ్మనం చేసేందుకు మైదానాలు ఏర్పాటు చేసి లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

మూడు చోట్ల స్వాగత వేదికలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. మూడు వేలకు పైగా ఏర్పాటుచేసిన విగ్రహాల్లో సగానికిపైగా భారీ ఎత్తులో ఉన్నందున వాటిని నిమజ్జనం చేసేందుకు కొత్తపల్లి చెరువు, చింతకుంట ఎస్సారెస్పీ కాలువ, మానకొండూరు చెరువు వద్ద భారీ క్రేయిన్లను, లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెరువులు, కాలువల్లో భారీగా నీరుచి ఉన్నందున ఎలాంటి ప్రమాదాలుజరుగకుండా డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్ళు, ఫైర్‌సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పోలీసు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మూడు చోట్ల స్వాగత వేదికలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోమవారం జరిగే నిమజ్జనోత్సవాలకు ఆలోగా పనులు పూర్తయ్యేలా అధికారులను ఆదేశించామని తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

- హైదరాబాద్ సెంట్రల్ ఎన్ఐపీహెచ్ఎం శాస్త్రవేత్త ఆర్ సునీత
- దుర్శేడ్‌లో పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



దుర్శేడ్ గ్రామంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 13: పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని హైదరాబాద్ సెంట్రల్ ఎన్ఐపీహెచ్ఎం శాస్త్రవేత్త ఆర్ సునీత రైతులకు సూచించారు. శుక్రవారం కరీంనగర్ మండలం దుర్శేడ్ రైతు వేదికలో రైతులకు, పురుగుల మందులు విక్రయించే డీలర్లకు సమగ్ర సస్యరక్షణ-యజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పండిస్తున్న పంటలను నేరుగా పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఎన్ఎస్ఎస్ అనే యాప్‌ను ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, పంటలో ఉన్నటువంటి చీడ పీడల ఫోటోను తీస్తే వెంటనే అది ఏరకమైన పురుగు, తెగులు అనేది నిర్ధారణ చేసి, చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు, పురుగుల మందుల వివరాలను రైతులకు తెలియజేస్తుందని తెలిపారు. రైతులు ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా సరైన పురుగు, తెగులు మందును పిచికారి చేసి పురుగు ఉధృతిని తక్షణమే నివారించి పంట దిగుబడిని పెంచుకోవచ్చని రైతులకు తెలిపారు. వివిధ పంటల్లో సస్యరక్షణ చర్యలపై జిల్లా వ్యవసాయాధికారి జె భాగ్యలక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్ శ్రీధర్‌రావు ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న బోడ కాకరకాయ, చిక్కుడు, చామ, కంద వంటి పంటలు సాగు చేయాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కె రణధీర్ మొక్కల సాంద్రతపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక శాస్త్రవేత్తలు రాజేంద్ర ప్రసాద్ మిరప పంటలో రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఐపీహెచ్ఎం శాస్త్రవేత్త వెంకటరెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, దుర్శేడ్ చైర్మన్ తోట తిరుపతి, ఆత్మ చైర్మన్ గొనె నర్సయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి బి సత్యం పాల్గొన్నారు.

సంక్షేమ నిధులు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు

భగత్‌నగర్, సెప్టెంబరు 13: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని రౌండ్ టేబుల్ సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ అభిప్రాయపడింది. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, స్వతంత్ర్య సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణ కార్మి కుల వెల్ఫేర్ బోర్డు నిధుల నుంచి 54 రకాల కార్మికులు 11 రకాల సంక్షేమ పథకాలు పొందుతున్నారన్నారు.సంక్షేమ నిధులను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం సరైందికాదన్నారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, కదిరె రమేష్, నెల్లి కనకయ్య, చక్రపాణి, జగదీష్, జిందం ప్రసాద్, ఆకుల మల్లేశం,బొంకూరి రాములు, కొత్తపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

అందరికీ విద్య, ఉపాధి కల్పనకు ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 13: అందరికీ విద్య, ఉపాధి కల్పనకు ఉద్యమించాలని జర్నలిస్టు, ఆర్థిక విశ్లేషకుడు పాపారావు అన్నారు. నగరంలో నిర్వహిస్తున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణరాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందన్నారు. విద్య కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశం అని, కేంద్రంపూర్తిగా రాష్ట్రాల హక్కులను హరించి విద్యను నియంత్రిస్తోందని విమర్శించారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సొంతగా అధికారం చేపట్టేందుకు అవసరమైన సీట్లు గెలువ లేక పోయిందన్నారు. ప్రతిపక్షాలపై విస్తృత దాడులు, కేంద్ర సంస్థల దుర్వినియోగం ఎన్నికల్లో జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రులు జైలు పాలయ్యారన్నారు. మోదీ మతపరమైన ఉగ్రవాద వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం ఉదాసీనంగా, ఏకపక్షంగా వ్యవహరించిందని విమర్శించారు. సమావేశంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, సాహితీ జూనియర్ కళాశాల చైర్మన్ ప్రభాకర్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీఆర్ మధు, రాజేష్, సూరి, సహ కార్యదర్శులు నగేష్, రంగస్వామి, వీరబాబు, వెంకటేష్, తిరుపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, గణేష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జర్నలిస్టు, ఆర్థిక విశ్లేషకుడు పాపారావు

నిధుల మళ్లింపులో మున్సిపల్ కమిషనర్‌పై కేసు

- మరిన్ని సెక్షన్లు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: స్మార్ట్‌సిటీ నిబంధనలను ఉల్లంఘించి నగరపాలక సంస్థ పరిధిలో కాకుండా శివారు గ్రామానికి నిధులను మళ్ళించి దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ మేయర్, కార్పొరేటర్ సర్దార్ రవీందర్‌సింగ్ గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఎస్ఈ, ఇతర అధికారులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులను నగర పరిధిలోని 50 డివిజన్లలో వెచ్చించి అభివృద్ధి చేయాల్సి ఉండగా ఇతర అవసరాలకు మళ్ళించారన్నారు. 2022 ఆగస్టు 8న మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అండ్ మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ బొమ్మకల్ జంక్షన్ అభివృద్ధికి టెండర్లు నిర్వహించారన్నారు. ఆ జంక్షన్ కరీంనగర్ లిమిట్స్‌లో లేదని, ఇలా నిధులను ఇతర అవసరాలకు నిబంధనలను ఉల్లంఘించారని తెలిపారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్‌టెన్సీ, మున్సిపల్ అధికారులు, మేయర్ జంక్షన్ పనులను వేగంగా పూర్తిచేయాలంటూ టెండర్లలో పనులు దక్కించుకున్న మాధవ కన్‌స్ట్రక్షన్‌కు 2024 జనవరి 2న నోటీసులు జారీ చేశారన్నారు. స్మార్ట్‌సిటీ పరిధిలో లేకున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ఖర్చుచేయాల్సి ఉండగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆధారాలతో సహా 2024 జూలై 3న కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు ఎలాంటి చర్య తీసుకోక పోవడంతో హైకోర్టును ఆశ్రయించానని చెప్పారు. హైకోర్టు ఆధారాలను పరిశీలించి ఆనాటి మున్సిపల్ కమిషనర్, ఎస్ఈతోపాటు ఇతర అధికారులపై కేసు నమోదు చేసి విచారణ జరుపాలని ఆదేశించడంతో ఈనెల 11న కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారని రవీందర్ సింగ్ తెలిపారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో నగరాన్ని అభివృద్ధి చేయకుండా నగరపాలక సంస్థ పరిధిలో లేని ప్రాంతాలకు స్మార్ట్‌సిటీ నిధులను మళ్లించి అక్కడ అభివృద్ధి చేశారంటూ మున్సిపల్ ఉన్నతాధికారులు, కలెక్టర్, సీడీఎం ఎతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలే దన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఇంకా కొన్ని సెక్షన్లను కూడా నమోదు చేసి అధికారులపై చర్య తీసుకోవాలని పోలీసు కమిషనర్‌ను కోరుతున్నట్లు తెలిపారు. ఒకవేళ పోలీసులు ఇతర సెక్షన్లను వారిపై నమోదు చేయకుండా కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే తిరిగి హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు. అధికారులపై చర్య తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని రవీందర్‌సింగ్ స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరి ప్రసాద్, మహేశ్, కెమసారపు తిరుపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్

ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన దినో త్సవం నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వ యంతో పూర్తి చేయాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం నాటికే ఏర్పాట్లు పూర్తిచేసి సన్నద్ధం కావాలన్నారు. 17న ఉదయం ముఖ్య అతిథి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ చేసి, తమ సందేశాన్ని అందజేస్తారని, అనంతరం స్టాల్స్ సందర్శన ఉంటుందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి జిల్లా అధికారు లంతా తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గణేష్ నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉల్ నబీ పండుగల నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతో కలెక్టర్ పమేలా సత్పతి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులకు, పోలీసులకు అన్ని విధాలా సహకరించాలని కోరారు. పండుగల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అపశ్రుతులకు తావులేకుండా ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం, మీలాద్ ఉన్ నబి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని, పరస్పర సహకారంతో గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రశాంత వాతావర ణంలో నిర్వహించుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిమజ్జన ఉత్సవం సాఫీగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ వేడుకల సంద ర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పరస్పర సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతి విద్యార్థి సైన్స్ మ్యూజియాన్ని సందర్శించాలి

నగరంలోని పురాతన పాఠశాలలో ఆధునీకరించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రతి విద్యార్థి సందర్శించాలని, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సైన్స్ మ్యూజియాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలోని మినీ ప్లానిటోరియం, డైనోసారోస్, వివిధ రకాల సైన్స్ పరికరాలను పరిశీలించారు. కరోనా సమయంలో మూతపడిన ఈ మ్యూజియాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఎన్నో పరికరాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మ్యూజియం నిర్వహణకు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. అనంతరం పిల్లల సందర్శనకు అనుమతి ఇవ్వాలని సైన్స్ అధికారి జైపాల్ రెడ్డిని ఆదేశించారు. సెలవు రోజుల్లోనే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.



సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బాల బాలికలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

కరీంనగర్ టౌన్: బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో ముందు కు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలిం భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కౌమార విద్య అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కౌమార దశలో విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, సమాజ ధోరణిని తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాజరైన ప్రతి విద్యార్థి వారి పాఠశాల విద్యార్థులందరికీ అవగాహన కల్పించాలన్నారు. సాంఘిక అసమానత్వాన్ని వీడాలని సూచించారు. యవ్వన దశలో విద్యార్థులు చెడు మార్గాల్లో వెళ్లకూడదని సూచించారు. నేర్చుకోవాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనన్నారు.

బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం

- స్కూల్ పిల్లలకు గాయాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13: కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్‌కు వస్తున్న బస్సు, లారీలు ఒకదానికి ఒకటి ఢీకొట్టగా ఆ వెనుకనే వస్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. శుక్రవారం ఉదయం రాజీవ్‌రహదారి ఫ్లైఓవర్ వద్ద మొదట లారీని డ్రైవర్ హఠాత్తుగా ఎడమవైపు తిప్పగా ఆ వెనుక ఉన్న బస్సు కూడా ఎడమ వైపు మలుపు తీసుకుంటుండగా వెనుకవస్తున్న ఆటోకు బలంగా తగిలింది. దీంతో ఆటోలో ఉన్న ప్రైవేట్ స్కూల్ ఆరుగురు విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు కొందరికి కూడా స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. రోడ్డుపై మూడు వాహనాలు ఢీకొట్టి నిలిచిపోవటంతో కిలోమీటర్ దూరం వరకు వాహనాలు అరగంట వరకు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రాకపోకలను క్రమబద్ధీకరించారు.


రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు(ఇన్‌సెట్‌లో ధ్వంసమైన ఆటో)

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

రామడుగు, సెప్టెంబరు 13: మండలంలోని ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. గోపాల్‌రావుపేట గ్రామంలోని ప్రగతి హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి దండవేణి రామ్‌తేజ్, వెలిశాల గ్రామంలోని సరస్వతి హైస్కూల్‌కి చెందిన 8వ తరగతి విద్యార్థి ముచ్చే చరణ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు అన్నదానం రాధాకృష్ణ, ఉప్పు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మునిందర్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి జూనియర్ బేస్ బాల్ పోటీలకు..

మానకొండూర్, సెప్టెంబరు 13: రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలకు మండలంలోని వెల్ది ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారు. నిర్మల్ జిల్లాలో ఈ నెల 14 నుంచి 16వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో తనుజ, లాస్య, హాసిని, సహస్ర, తనసి, సమీర, బాలుర విభాగంలో రాంచరణ్, సాయిచరణ్, రుత్విక్, ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, పీఈటీ ఎండీ యూనిష్‌పాషాతెలిపారు. వీరి ఎంపికపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌టీపీసీలో ఎల్‌పీజీ ట్యాంకర్ బోల్తా

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

జ్యోతినగర్, సెప్టెంబరు 13: రామగుండం తహసీల్దార్ కార్యాలయం సమీప రాజీవ్ రహదారిపై శుక్రవారం ఎల్‌పీజీ ట్యాంకర్ బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు ఎల్‌పీజీ గ్యాస్‌ను తరలిస్తున్న ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాకొట్టింది. అయితే ట్యాంకర్‌లోని గ్యాస్ లీక్ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని అత్యంత జాగ్రత్తగా జేసీబీతో ట్యాంకర్‌ను పైకి లేపారు. ఎలాంటి అగ్ని ప్రమాదం జరగకుండా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కృషి చేయడంతో ప్రమాదం తప్పింది.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13: కరీంనగర్‌లోని మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఉదయం దోనపాటి అనుష అనే మహిళ తన పర్సు పోగొట్టుకోగా ఆ పర్సు తోటపల్లికి చెందిన సంతోష్ అనే వ్యక్తికి దొరికింది. సంతోష్ నిజాయితీగా ఆ పర్సును కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులకు అప్పగిం చాడు. పోలీసులు పర్సులో ఉన్న ఆధార్ కార్డుతో అనుషకు సమాచారం అందించారు. అనూష భర్త రమణారెడ్డిని ఠాణాకు పిలిచి పర్సును అప్ప గించారు. పర్సులో 1,500 రూపాయలతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కొండగట్టులో తలనీలాల టెండర్లు మళ్లీ వాయిదా



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టెండర్‌దారులు

మల్యాల, సెప్టెంబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరి ధిలో తలానీలా పోగు చేసుకునేందుకు గాను అధికారులు హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు మూడో సారి శుక్రవారం నిర్వహించారు. ఇందులో పది మంది టెండర్ దారులు పాల్గొన్నారు. అయినప్పటికీ సరైన పాట రానందున వేలం వాయిదా వేస్తున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి గాను మొదటి సారి నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1116 హెచ్చు పాట రాగ ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించారు. అయినప్పటికీ రూ1.68కోట్లు మాత్రమే పలికింది. దీంతో వాయిదా వేసిన అధికారులు మళ్లీ ఈ నెల 30న టెండర్లు నిర్వహిస్తామని ప్రక టించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవే క్షకులు చంద్ర శేఖర్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. టెండర్‌దారులు కుమ్మక్కు అవడంతోనే వేలం పెరగడం లేదని తెలుస్తోంది.

ఎన్నో వెతలు.. కథలుగా అక్షర రూపం

» కరీంనగర్ కథల సంకలనం

» నేడు రంగినేని ట్రస్ట్‌లో ఆవిష్కరణ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కథా రచనలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొస్తాయి. లేదా కాసేపు యాతన మరిచి ఆహ్లాదప రిచే విధంగా మనస్సును తేలిక పరుస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరి ప్రతిఘటన, రైతాంగా పోరాటాల నుంచి పుట్టిన కథలు ఇప్పటికీ చదివి స్తున్నాయి. ప్రశ్నించే తత్వాన్ని ఇస్తున్నాయి. కొంత కాలంగా కథా రచనల్లో స్తబ్ధత నెలకొందని చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో 63 కథలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తొలితరం, మలితరం రచయితల నుంచి మొదలుకొని ఈ తరం యువ రచయితల వరకు అందించిన కథలను పోగు చేసి 'కరీంనగర్ కథలు' పేరుతో సంకలనాన్ని తీసుకొచ్చారు. తెలంగాణ పరిస్థితులను అద్దంపట్టే విధంగా రాసిన కథలే కేంద్ర బిందువుగా కనిపిస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కథకులతో వెల్లడవుతున్న కథల సంపుటిని శనివారం సిరిసిల్లలోని రంగినేని ట్రస్ట్‌లో ఆవిష్కరించనున్నారు. రంగినేని ఎల్లమ్మ పురస్కార కమిటీ చైర్మన్ రంగినేని మోహన్‌రావు అధ్యక్షతన జరిగే ఆవిష్కరణోత్సవంలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని విశిష్ట అతిథిగా ఆచార్య సి. కాశీం హాజరుకానున్నారు.

- మరోసారి సాహిత్య అభిమానుల ముందుకు..

కరీంనగర్ కథలు ప్రముఖ రచయితలు జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్ కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, మద్దికుంట లక్ష్మణ్, గరిపెల్లి అశోక్ సంపాదకవర్గంలో మరోసారి సాహిత్య అభిమానుల ముందు కొచ్చాయి. కథ సంకలనాన్ని, సాహిత్యాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపించే రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటెబుల్ ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు ఆర్థిక సహకారం అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానేరు, మూలవాగు, గోదావరి తీరాల నుంచి ఎంతో మంది కవులు, కథకులు వచ్చారు. వారి కథలను ఎంపిక చేసి సంకలనంగా తేవడం సవాలుగానే చెప్పుకోవచ్చు. కాగా కరీంనగర్ కథల పేరుతో వచ్చిన సంపుటిలో కథలు దొరల గడీల నుంచి గ్రామాల్లో సాగిన సంఘర్షణలు, పోరాల జ్ఞాపకాలను మరోసారి పలకరిస్తున్నాయి. తొలి కథకుల్లో ఒకరైన అవునూర్ వేణుగోపాల్‌రావు, జి.రాములు, ప్రధాని పీవీ నరసింహారావు నుంచి అల్లం రాజయ్య, సాహూ, చెన్నమ నేని రాజేశ్వర్‌రావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు, నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం, సాధన, బీఎస్ రాములు, జింబో, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, సురమౌళి, మచ్చ ప్రభాకర్, చైతన్య ప్రకాష్, అల్లం వీరయ్య, కేవి నరేందర్, కాలువ మల్లయ్య, జయధర్ తిరుమలరావు, వెల్దండి శ్రీధర్, నూతన్, నల్ల అదిరెడ్డి, మిత్ర, చెన్నమనేని హనుమంతరావు, ఆడెపు లక్ష్మణ్, ఇలా అనేక మంది కథలను పొందుపరిచారు.



కరీంనగర్ కథల సంపుటి

ఏజెన్సీకి కొండగట్టు మాస్టర్‌ప్లాన్ తయారీ

- తీర్మానం చేసిన కమిటీ - హైదరాబాద్‌లో సభ్యుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు తదితరులు

మల్యాల, సెప్టెంబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం మాస్టర్‌ప్లాన్ ఏజెన్సీ ద్వారా రూపొందించడానికి నిర్ణయించారు. ఇందుకు గాను అవసరమైన ఏజెన్సీ నియామకానికి మాస్టర్‌ప్లాన్ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కమిటీ సభ్యులు దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం అయ్యారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో మాస్టర్‌ప్లాన్ తయారీని ఏజెన్సీకి అప్పగించాలని నిర్ణయించగా అందుకు గాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా చర్యలు తీసుకుంటామని ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఏజెన్సీలు రూపొందించిన మాస్టర్‌ప్లాన్ పరిశీలించి అందుకు తగిన చర్యలు చేపట్టడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎండోమెంట్ సీఈ, అడిషనల్ కమిషనర్, ఎస్ఈ, స్తపతి, ఈఈ, వేములవాడ దేవస్థానం ఈఈ, కొండగట్టు ఈవో రామకృష్ణరావు, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్‌లతో పాటు ఆలయ అధికారులు అంజయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 13: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలని బహుజన సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మారంపెల్లి లక్ష్మీనారాయణ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా అవకాశం కల్పిస్తే ప్రజలకు సేవలందిస్తారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మీసాల ధన్‌రాజ్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి లక్ష్మణ్, హస్తపురం రాజయ్య, అక్కపెల్లి మల్లేశం, చింతల రమేశ్, చింతల చిరంజీవి, హస్తపురం రమేశ్, గాలి అనిల్, నాగి అశోక్‌కుమార్, గుర్రాల రవీందర్, బెజ్జంకి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం ఇన్ ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 28,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 28,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మధ్యాహ్న భోజనంలో నీళ్ల చారు

- కడుపు నిండా తినని విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యా ర్థులు అర్ధకాలితో అలమటించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు నీళ్ల చారు వడ్డించడంతో పిల్లలు కడుపు నిండా తినలేకపోయాడరు. ఆకలితో మధ్యాహ్నం 2.30 గంటలకు ఆకలి అవుతోందని, ఇంటికి పంపించాలంటూ సుమారు 30 మంది పిల్లలు తరగతి గదుల్లో ఏడవడం ప్రారంభించారు. గమనించిన హెచ్ఎం లింబయ్య ఏడుస్తున్న విద్యార్థులను ఇంటికి పంపించారు. ఇళ్లకు చేరుకున్న పిల్లలు భోజనం చేసి తిరిగి పాఠశాలకు వచ్చారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై హెచ్ఎం లింబయ్యను వివరణ కోరగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు సరిపడ పప్పు వండకపోడంతో సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. పిల్లలు ఆకలితో ఏడిస్తే వారి ఇళ్లకు పంపించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13: కొత్తపల్లి మండలం రేకుర్తిలోని శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుప త్రిలోని మార్చ్యూరీ గదిలో భద్రపరి చామని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినవారు. 9494490268నంబరకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

జాతీయ విపత్తు కింద 10వేల కోట్లు కేటాయించాలి

» గత ప్రభుత్వం తీరు వల్లే నేడు వీధుల్లోకి రాజకీయాలు » సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 13: కొన్ని రోజుల క్రితం రాష్ట్రంలో వచ్చిన వరదల వల్ల వేల ఎకరాల పంట నష్టం వాటిల్లిందని, దానికి జాతీయ విపత్తు కింద 10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెద్దబొంకూరులో సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ తండ్రి సమ్మయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామార్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధినేత అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోని రాజకీయాలను దిగజార్చరని దీని వల్ల రాజకీయాలన్ని అసెంబ్లీలో ఉండలా.. వీధుల్లోకి వచ్చాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించాల్సింది పోయి ఏకంగా రోడ్లపైనే దమ్ముందా.. చూసుకుందామా అంటూ అసభ్యపదజాలంతో దుర్భషలాడుకుంటున్నారన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీల సవాళ్లను చూస్తే రాజకీయం అంటే ఎంత దిగజారిందో అర్థమవుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కౌశిక్‌రెడ్డి కూడా ఇతర పార్టీల నుండి బీఆర్ఎస్‌లో చేరారని, దానిని మర్చిపోవద్దన్నారు. వేరే పార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి ఇతర పార్టీలో చేరే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే అలా చేరిన వారికోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు.

వీధుల్లో సవాల్‌లు వేసుకునేకంటే కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల పట్ల సీపీఐ పార్టీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. నక్సలైట్ల పట్ల బీజేపీ మంత్రులు అసభ్య కరంగా మాట్లాడుతున్నారని వారు కూడా భారతదేశంలో ఉన్నారని వారికి కూడా దేశభక్తి ఉందన్నారు. అలాంటి వారిని చంపేస్తామని హెచ్చరించడం సబబు కాదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశంలో నక్సలిజాన్ని తూడ్చి ఎడుతానని వ్యాఖ్యానించడం, ఆ స్థాయిలో ఉండి అలాగే సంబోధించడం సరైంది కాదన్నారు. దేశ హోం శాఖ మంత్రి అమిత్‌షా మార్చి 2026 వరకు దేశంలో మావోయిస్టులు అనే మాట లేకుండా చంపేస్తామని చెప్పడం హేయమైనా చర్య అని మావోయిస్టులకు కూడా దేశం పట్ల గౌరవం, భక్తి ఉందని అన్నారు. ఈ మధ్యన నడుస్తున్న హైడ్రా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి మొట్టమొదటి సారిగా ఈ ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీ మద్దతు పలికిందన్నారు. నాలా, చెరువులు, కుంటల్లో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబ్జాలు చేసి అపార్ట్‌మెం ట్‌లు, పెద్ద పెద్ద విల్లాస్‌లు నిర్మించారని, దీంతో హైదరా బాద్‌లో వర్షాలు కురిసినప్పుడల్లా ఇళ్లు, నాలాలు నిండి జలదిగ్బంధమవుతుందన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని గుర్తు చేశారు. హైడ్రా అందరికి వర్తిం చాలని , పేద ప్రజల ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటే వారికి ప్రత్యామ్నాయంగా చూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మర్రి వెంకటస్వామి, పెద్దపల్లి సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గౌతం గోవర్ధన్, బాలసాని లెనిన్, కోయ్యాడ సృజన్‌కుమార్, మునీర్, సమ్మయ్య, అరెపల్లి మానస్‌కుమార్, చంద్రగిరి ఉదయ్‌కుమార్, కల్లెపల్లి నవీన్‌లతో పాటు పలువురు ఉన్నారు.

డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్టు



డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 13: డాక్టర్, నర్సు నిర్లక్ష్యంగా వైద్యం అందించిన కారణంగానే తన కూతురు చనిపోయిందనే కోపంతో డాక్టర్ కొక్కుల రాజేష్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణం చింతలవాడకు చెందిన ఎండీ ఖదీర్ హుస్సేన్ పండ్ల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. అతడి చిన్న కూతురు 7 నెలల అబిహ నంజు అనారోగ్యానికి గురి కావడంతో ఈనెల 8వ తేదీన పట్టణంలో గల సిద్ధార్థ హాస్పిటల్ చేర్పించాడు. 10వ తేదీన డాక్టర్ డిశ్చార్జి చేయడంతో ఇంటికి వెళ్లారు. 12వ తేదీన ఉదయం పాపకు ఇంజక్షన్ ఇప్పించేందుకు రాగా, డాక్టర్, నర్సు ఇద్దరు కలిసి ఇంజెక్షన్ ఇచ్చారు. ఆ వెంటనే అబిహ నంజు ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్ సూచన మేరకు కరీంనగర్‌లోని స్పర్శ ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్నం 3:30 గంటలకు పాప మరణించింది. డాక్టర్, నర్సు నిర్లక్ష్యం కారణంగానే ఖదీర్ డాక్టర్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడని తెలిపారు. ఖదీర్‌పై సెక్షన్ 109(1), 329(1), 324(5) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ అండ్ సెక్షన్ 8(2) కింద అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13: రెండు రోజుల కిందట ఇంటి యజమాని తన కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామానికి వెళ్లడంతో పని మనిషి దొంగ బుద్ధి చూపాడు. సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లాడు. దొంగను పోలీసులు 24 గంటల్లో పట్టుకొని రిమాండ్ తరలించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట మండలం నర్మాలలోని పురం గోవర్ధన్‌రావు ఇంటిలో ఈ నెల 12న చోరీ జరిగింది. ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలోని పోలీసులు రంగంలోకి దిగి ఇంటిలోని బీరువా, చుట్టు పక్కల పరిశీలించారు. పని మనిషిపై అనుమానం రావడంతో అదే గ్రామానికి చెందిన కర్రోళ్ల నర్సింలును అదుపులోకి తీసుకుని విచారించారు. బంగారు ఆభరణాన్ని దొంగిలించానని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి 66 గ్రాముల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. పని మనిషి కర్రోళ్ల నర్సింలును అరెస్ట్ చేశారు. దొంగతనం కేసును 24 గంటల్లో ఛేదించిన ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందిని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మల్యాల, సెప్టెంబరు 13: అక్రమంగా నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్‌బియ్యంను అధికారులు పట్టుకున్నారు. దిగువ కొండగట్టులో పెద్దమ్మవాళ్ల కాలనీలో బియ్యం పట్టుకొని సివిల్‌సప్లై గోదాంకు తరలించారు. దాడిలో సివిల్‌సప్లై డీటీ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్సై నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో మాజీ సర్పంచ్ మృతి



మమత(ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 13: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ తాజామాజీ సర్పంచ్ అంకం మమత(35) శుక్రవారం జ్వరంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మమత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుతోంది. కుటుంబ సభ్యులు ఆమెను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఆమెను కరీంగనర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. 2019-2024 వరకు జాబితాపూర్ సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందిం చారు. అతి పిన్న వయస్సులో జ్వరంతో జాబి తాపూర్ మాజీ సర్పంచ్ మమత మృతిచెందడం చాలా బాధకరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మమత కుటుంబసభ్యులను ఎమ్మెల్యేతో పాటు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత వేర్వేరుగా పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన దానబోయిన రాజు (45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన హనుమ పెద్ద పోచయ్య తీవ్రంగా గాయపడ్డాడు. రాజు తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి కోరుట్లపేట మీదుగా గొల్లపల్లి వైపునకు వస్తున్నాడు. కోరుట్లపేట వాసి పెద్దపోచయ్య తన బైక్‌పై పొలం వద్దకు వెళ్లి వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొన్నాయి. రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపిన పోచయ్యను 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

సైదాపూర్, సెప్టెంబరు 13: సైదాపూర్ మండలంలోని సోమారం చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సమ్మయ్య అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య ఉద్యోగరీత్యా బైక్‌పై మరో ఉపాధ్యా యుడితో కలిసి మొలంగూర్ నుంచి ఆకునూర్ పాఠశాలకు వస్తున్నాడు. ఆర్టీసీ బస్సు సైదాపూర్ నుంచి సోమారం మోడల్ స్కూల్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో సోమారం క్రాసింగ్ వద్ద బస్సు, బైక్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. సమ్మయ్యకు తీవ్రగాయాలు కాగా హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమ్మయ్య ఆకునూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్నాడు.

ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 13: మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన బండారి శంకరయ్య ఇంట్లో నుంచి విలువైన పత్రాలు ఎత్తుకెళ్లిన బండారి పర్శరాములును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. చంద్రయ్య ఇంటికి తాళం వేసి కరీంనగర్ వెళ్లాడు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగటగొట్టి ఉంది. బంగారు, వెండి వస్తువులతోపాటు భూమిపత్రాలు, ఇతర డాక్యుమెంట్స్ చోరీకి గురయ్యాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టగా పొత్తూరు వంతెన సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అదే గ్రామానికి చెందిన పర్శరాములును అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. కొంతకాలంగా ఇద్దరి మధ్య భూవివాదం కొనసాగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం వార్తలు

గిరిజన పాఠశాల పీఈటీపై కేసు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 13: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ శివారులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల పీఈ టీ జ్యోత్స్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులను పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, శారీరకంగా హింసించినందుకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పీఈటీని విధుల్లో నుంచి తొలగించారని తెలిపారు.

ఉపాధ్యాయులపై కేసు నమోదు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13: మండలంలోని తారుపెల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. పాఠశాలలో చదువుకుంటున్న బాలికలపై ఇద్దరు ఉపాధ్యాయులు సదానందం, అబ్దుల్ ఖాద్రి అసభ్యంగా ప్రవర్తించారంటూ వారి కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో జరిమానా

వేములవాడ, సెప్టెంబరు 13: చర్చి ఫాదర్‌పై హత్యాయత్నం కేసులో 18 మందికి న్యాయస్థానం జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015లో వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్ సమీపంలో చర్చి ఫాదర్ తిమోతిని తొలగించి బ్రదర్ సువర్ణపాల్‌ను ఫాదర్‌గా నియమించిన సందర్భంలో ఫాదర్ తిమోతి మరో 17 మందితో చర్చిలోకి ప్రవేశించి ఫాదర్ సువర్ణపాల్ పై హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ ఒక్కొక్కరికి పదివేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

విద్యుత్ మోటార్ల వైర్ల దొంగతనం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13: మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామ శివారులోని మానేరు పరివాహక ప్రాంత రైతుల విద్యుత్ మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు ఆ గ్రామ రైతులు తెలిపారు. శుక్రవారం వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లి చూడగా సుమారు 20 మంది రైతుల స్టార్టర్ నుండి విద్యుత్ మోటార్ వచ్చే కాపర్ వైర్‌ను దొంగిలించినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.70వేల వరకు నష్టం జరిగినట్లు రైతులు సలీం లక్కాకుల రమేష్, బొజ్జం రాజయ్య, లక్కాకుల సదయ్య, తోట రవి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఉపాధ్యాయులపై ఇన్‌చార్జి డీఈవో విచారణ



విచారణ జరుపుతున్న ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13: మండలంలోని తారుపల్లి గ్రామంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఆ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బాలికలను వేధించడంపై ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు శుక్రవారం విచారణ చేపట్టారు. తారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బాలికల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించిన విషయం విదితమే. అసభ్య ప్రవర్తన పట్ల బాలికల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటనపై స్పందించిన ఇన్‌చార్జి డీఈవో తారుపల్లి ఉన్నత పాఠశాలల పాఠశాలలోని ఉపాధ్యాయులను, విద్యార్థులను వేరువేరుగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులపై విచారణ అనంతరం నివేదిక తయారు చేసి సంబంధితపై అధికారులకు ఈ నివేదికను అందజేయనున్నట్లు ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు తెలిపారు.

అరాచకం సృష్టించేందుకు గులాబీ నేతల యత్నం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్: సెప్టెంబరు 13: తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేసి అరాచకం సృష్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల మధ్య చోటుచేసుకున్న వివాదమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో వైషమ్యాలు సృష్టించేందుకు కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ అధిష్టానం పావుగా వాడుకుంటున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతానంటూ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ మహిళలను అవమానించినట్టేనని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి అరాచకవాదిగా మారిపోయాడన్నారు. ఇప్పటికైనా గులాబీ నేతలు కౌశిక్‌ను కట్ట డి చేయకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి : వెలిచాల

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 13: బతకడానికి వచ్చినవ్ నీవేంది అంటూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కించపరిచిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై కేసీఆర్, కేటీఆర్, హరీ‌ష్‌రావు సమాధానం ఇవ్వాలని, బీఆర్ఎస్ పార్టీ నుంచి పాడి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అన్నారు.

పట్టభద్రుల సంక్షేమానికి చేయూత అందిస్తా

భగత్‌నగర్, సెప్టెంబరు 13: పట్టభద్రుల సంక్షేమానికి చేయూతనందిస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి పట్టణంలో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పట్టభద్రులకు భరోసా కల్పిస్తామన్నారు. వేద మంత్రాల మధ్య బ్రాహ్మణోత్తములచే ఆశీర్వాదాల అందుకుని తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య క్యాంపు కార్యాలయం ప్రారంభించారు.

సిద్దిపేట వద్ద ఆర్టీసీ బస్సులో మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కుకునూరుపల్లి, సెప్టెంబరు 13: కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మోడిదీపూర్ శివారులో ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో బస్సు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. అయితే, డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే.. కరీంనగర్ డిపోకు చెందిన రాజధాని డీలక్స్ బస్సు శుక్రవారం 10 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తోంది. మోడిదీపూర్ శివారులోకి రాగానే బస్సు ఇంజన్‌లో పొగ రావడంతో డ్రైవర్ అప్రమత్తం అయ్యారు. అక్కడే బస్సు ఆపి పరిశీలించగా, ఇంజన్ భాగంలో మంటలు కనిపించాయి. దీంతో బస్సులోని ప్రయాణికులను కిందికి దింపేశాడు. పోలీసులకు, అగ్నిమాపక దళానికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను ఆర్పేశారు. మంటలతో బస్సు మొత్తం పొగ కమ్ముకుపోయింది.

వరద బాధితులకు రిటైర్డు ఇంజనీర్ల సంఘం సాయం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న రిటైర్డు ఇంజనీర్లు

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 13: రిటైర్డు విద్యుత్ ఇంజనీర్ల సంఘం కరీంనగర్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి తెలంగాణలో నష్టపోయిన వరద బాధితుల కోసం రూ.80,000ల చెక్కును అందజేశారు. సంఘం స్థాపించిన 17 సంవత్సరముల నుంచి సంఘ సభ్యుల నుంచి పొందిన విరాళాలు రూ.10 లక్షలు ఫిక్స్ చేసి దాని నుంచి పొందే వడ్డీని ప్రతి సంవత్సరం అనాథ వృద్ధుల పిల్లలు, వృద్ధులను సంరక్షించే ఎన్జీవోలకు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మర్ డైరెక్టర్ గణపతి, కార్యవర్గ సభ్యులు సుగుణాకర్‌రావు, ప్రసాదరావు, సత్యనారాయణ, లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

● సుభాష్‌నగర్: మానసిక ఒత్తిడి నివారణ అంశంపై ఉచిత కౌన్సిలింగ్ కోసం టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబరు 14416ను సూచించే ఫోమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశించారు. శుక్రవారం ఫోమ్ బోర్డును కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.

పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్13: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వార్డుల వారీగా పంచాయతీ ఫొటో ఓటరు జాబితాను ప్రదర్శించారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలు ఉండగా 170 వార్డులు ఉన్నాయి. ఇందులో మొత్తం 40,144 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,670, మహిళలు 20,488 మంది థర్డ్‌జెండర్ ఒకరు ఉన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే వార్డులో చేర్చాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కార్యదర్శులు ఆ దిశగా వార్డులను తయారు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శంకరపట్నం: గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ జాబితాను తయారు చేసి ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ నెల 14నుంచి 21వరకు ఓటర్ జాబితాలో మార్పులు చేర్పుల కోసం పంచాయతీ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28న ఫైనల్ ఓటర్ జాబితాను విడుదల చేయన్నుట్లు తెలిపారు.


సైదాపూర్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద పంచాయతీ కార్యదర్శులు ఓటర్ లిస్టు జాబితా ప్రతులను అతికించి ప్రదర్శించారు. ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని కార్యదర్శులు సూచించారు.

గుండ్లపల్లి స్టేజీ ఇక గ్రామ పంచాయతీ

గన్నేరువరం, సెప్టెంబరు 13: గన్నేరువరం మండలంలో గుండ్లపల్లి స్టేజీ మరో గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా 17 గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బీఎల్‌వోలు ఓటరు జాబితాలను వార్డుల వారీగా సేకరించి జీపీలో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు.

24 టీఎంసీలకు చేరువలో ఎల్ఎండీ

- కాకతీయ కాలువ నుంచి దిగువకు నీటి విడుదల



కాకతీయ కాలువ ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

తిమ్మాపూర్, సెప్టెంబరు 13: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం 24 టీఎంసీలకు చేరువలో ఉంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలకు గాను ప్రస్తుతం 23.903 టీఎంసీలకు చేరుకుంది. మోయతుమ్మెద వాగు ద్వారా 318 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండీ ద్వారా 889 క్యూసెక్కులు మొత్తం 1,207 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోలు ఎల్ఎండీలోకి వస్తున్నాయి. కాకతీయ కాలువ నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు దిగువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు మొత్తం 809 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

వీణవంక, సెప్టెంబరు 13: మండలంలోని చల్లూరు బస్టాండు కూడలీలో బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జక్కు నారాయణ, మధు, ఎలవేని మల్లయ్య, సంపత్‌రెడ్డి, పసియోద్దిన్, అనిల్, కూమార్, నాగరాజు, అజాం, నగేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనంగా కుంకుమ పూజలు



పద్మనాయక కల్యాణ మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హుజూరాబాద్‌లో కుంకుమ పూజలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 13: నగరంలోని వివిధ గణనాథులకు నాయకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 53వ డివిజన్ కాశ్మీర్‌గడ్డ వినాయకుని వద్ద నగరమేయర్ యాదగిరి సునీల్‌రావు, డివిజన్ కార్పొరేటర్ తుల శ్రీదేవిచంద్రమౌళిలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దమ్మ యూత్, అయ్యప్ప టెంపుల్ వద్ద, గోదాం వద్దక్రాంతి యూత్ 33, 35, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మేయర్ సునీల్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని హనుమాన్ నగర్ బతుకమ్మ గద్దె వద్ద శుక్రవారం కుంకుమార్చన, లక్ష్మీపూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. విద్యానగర్ శ్రీరాంనగర్ కాలనీ రోడ్‌నెం-2లో పిల్లలు ఏర్పాటు చేసినవినాయకుడి వద్ద పూజలు నిర్వహించారు.

● కరీంనగర్ క్రైం: పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనాయక కళ్యాణమండపంలో నెలకొల్పిన గణేష్ మండపంలో శుక్రవారం ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షులు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులు గండ్ర సంపత్‌రావు, ప్రధానకార్యదర్శి చీటి ప్రకాష్‌రావు, ఇతర కార్యవర్గ బోయినిపల్లి భూపతిరావు, నిమ్మనేని భీంరావు, జువ్వాడి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: నగరంలోని సీతారాంపూర్ సూర్యనగర్‌లో వినాయకుడి వద్ద శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్, పద్మనగర్ కాలనీల్లోని వరసిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకుడు ప్రణీత్‌శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ గంగాధర్, తిరుమలేష్, ధర్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, రమేష్, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గుడివాడ యూత్ గణేష్ మండపంలో మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయక మండపం నిర్వహకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఇందిరానగర్ గ్రామం సంగంపల్లిలో వినాయకుని మండపం వద్ద మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమ పూజలు, గౌరి పూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

● రామడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లోని గణేష్ మండపాల్లో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం జరిగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



శ్రీరాంనగర్ కాలనీలో వినాయకుడి వద్ద చిన్నారులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భగత్‌నగర్, సెప్టెంబరు 13: కొత్తపల్లిలో 11 కెవి పరిధిలోని ప్రదేశాల్లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడిఈ కొల్పుల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి పరిధిలోని రెడ్డిరామయ్యపల్లి, మార్కెట్ ఏరియా, అంబేద్కర్‌నగర్, బస్టాండ్ ఏరియా, మెడికల్‌కళాశాల ఏరియా, అల్ఫోర్స్ కళాశాల ఏరియా పరధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలో శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు సిరిసేడు, బూజునూర్ గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఆయా గ్రామాల్లోని సబ్ స్టేషన్‌లో మరమ్మత్తు పనుల దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి 11:30గంటల వరకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ ఒక ప్రకటనలో కోరారు.

● సైదాపూర్: సబ్‌స్టేషన్ల మరమ్మతులు ఉన్నందున శనివారం సైదాపూర్, ఆకునూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ ఆంజనేయులు తెలిపారు.

● మానకొండూర్: మండలంలోని లింగాపూర్, వెల్ది, ఊటూర్, పోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ షఫీఅహ్మద్ తెలిపారు. సాయంత్రం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వాలు సహకరించి నిధులిస్తేనే అభివృద్ధి పనులు పూర్తి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించి నిధులు అందిస్తేనే నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తవుతాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. శుక్రవారం 32వ డివిజన్‌లో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ మర్రి భావనతో కలిసి రూ.18 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. నిధుల మంజూరు కోసం అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కృషిచేయాలని కోరారు.

● మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ఖాకే తైబట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్వయం ఉపాధి మార్గాలను చూపడం అభినందనీయమని నగర మేయర్ సునీల్‌రావు అన్నారు. శుక్రవారం ఖాకే తైబ ట్రస్ట్ మిస్రీ గంజ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 18వ డివిజన్ సాలెహ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన టైలరింగ్ సెంటర్ నూతన భవన సముదాయాన్ని మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ సుధగోని మాధవికృష్ణగౌడ్, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్, ట్రస్టు చైర్మన్ రిటైర్డు ఐఏఎస్ అధికారి సయ్యద్ అజ్మతుల్లాతో కలిసి ప్రారంభించారు.

అభివృద్ధిలో ఇంజనీర్లదే కీలకపాత్ర : మేయర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: కరీంనగర్ అభివృద్ధిలో ఇంజనీర్లది కీలక పాత్ర అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని వైశ్యభవన్‌లో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుల్డ్ ఎక్స్-2024 ఐదవ ఎడిషన్‌ను మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లోకి వస్తున్న నూతన ఆధునిక పరిజ్ఞానంపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. నగర సుందరీకరణకు కూడా ఇంజనీర్లు సంపూర్ణ సహకారాన్ని అందించారని చెప్పారు. శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి ఇంజనీర్ల పాత్ర గొప్పగా ఉంటుందని చెప్పారు. ఈ నెల 13,14,15 మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో బిల్డింగ్ మెటీరియల్స్, ఇంటీరియర్స్, ఎక్స్‌టీరియర్స్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్స్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్‌కు సంబంధించిన 26 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన సుప్రీం ఇండస్ట్రీస్ స్టాల్‌ను సందర్శించి ఆ సంస్థ డీజీఎం జగదీశ్వర్‌ను ఇండస్ట్రీస్‌లో ఉత్పత్తి చేస్తున్న వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ తమ కంపెనీ 12వేలకుపైగా టోటల్ పైపింగ్ సొల్యూషన్‌కు సంబంధించి ఉత్పత్తులను తయారు చేస్తుందని తెలిపారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఈగల రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సెక్రట రీ గడ్డం హరికిషన్, మర్రి రాజేశ్, కాచర్ల రాజ్‌కుమార్, కోల అన్నారెడ్డి, అశ్విన్‌కుమార్, సబ్బని శ్రీనివాస్, నల్ల లక్ష్మయ్య, శ్రీకాంత్ వర్మ, సురేశ్‌బాబు, ప్రమోద్‌కుమార్, రంజిత్‌కుమార్, శ్రీధర్, అనిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, సెప్టెంబరు 13: హుజూరాబాద్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్‌కు వెళ్తారనే సమాచారంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో సీఐ తిరుమల్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్లో ఉంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా కరీంనగర్ మండల శాఖ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

భగత్‌నగర్: బీఆర్ఎస్ మ్మెల్యేల అక్రమ అరెస్టుకు నిరసగా హైదరాబాద్ వెళ్లకుండా కొత్తపల్లి బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టుచేశారు. అరెస్టయిన వారిలో భూక్య తిరుపతి నాయక్, జంగిలి సాగర్, కృష్ణగౌడ్, రాజశేఖర్, సయ్యద్ చాంద్‌పాషా, ఫిరోజ్ ఎల్లయ్య, అజయ్, కనకయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

గంగాధర: గంగాధరలో శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, నాయకులు మహిపాల్‌రావు, దామోదర్ ఉన్నారు.

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, తీగల మోహన్ రెడ్డి, పుల్లెల లక్ష్మణ్, మీసాల ప్రభాకర్, గూడెల్లి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వివాదం నేపథ్యంలో పోలీసులు స్థానిక బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు పుట్ట రాజు, రఫీఖాన్, అశోక్, నాయకులు, ఆలేటీ శ్రీరామ్, జవ్వాజి కుమార్, కౌశిక్, రాకేష్, వెంకటస్వామి తదితరులున్నారు.

వీణవంక: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో అడిగొప్పుల సత్యనారయణ, బండారి ముత్తయ్య, పోతుల నర్సయ్య, పోదిల రమేష్, మాల్లారెడ్డి ఉన్నారు.

చిగురుమామిడి: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడికి నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, అకావరం శివప్రసాద్, సన్నీల్ల వేంకటేశం, బొయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

హుజూరాబాద్, సెప్టెంబరు 13: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా విద్వేశాలు సృష్టిస్తూ రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతూ రెచ్చగొట్టడంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎస్ నరేష్, టి శ్రావ ణ్, బి నవీన్, జె అనిల్, గంగరాజు, చంద్రశేఖర్, వినోద్‌రెడ్డి, విష్ణు, మణిదీప్, అజీత్, కార్తీకేయ తదితరులు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

మానకొండూర్, సెప్టెంబరు 13 : ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నివారణపై సైక్రియాట్రిస్ట్ డాక్టర్ పృథ్వీరెడ్డి అవగాహన కల్పించారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ కె రాజేశ్వర్‌రావు, పీహెచ్‌సీ వైద్యులు సౌమ్య, ఎన్‌సీడీ జిల్లా కో-ఆర్డినేటర్లు ఎ. శ్రీనివాస్, బి పోచయ్య పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్ ఏర్పాటు

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 13: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ టూరిజం క్లబ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ కళాశాలలోని చరిత్ర విభాగం-అసిస్టెంట్ ప్రొఫెసర్ కనపర్తి సుధాకర్‌ను యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్‌గా నియమించారు. కళాశాలలో సుమారు 50 మంది విద్యార్థులతో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : డీఆర్డీవో



గ్రామసభలో మాట్లాడుతున్న చిగురుమామిడి ఎంపీడీవో

మానకొండూర్, సెప్టెంబరు 13 : పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని డీఆర్డీవో శ్రీధర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌డీవో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్ అర్బన్ సవరన్ స్ట్రీట్ సెక్టార్ బుట్టిరాజారాంకాలనీ-1 సెంటర్‌లో పోషణ మాసంలో భాగంగా శుక్రవారం సభ సీమంతాలు, పిల్లల పెరుగుదలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమణి, డాక్టర్ సల్మా మహీద్, మెడికల్ ఆఫీసర్, ఎంపీహెచ్‌ఈవో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలో ఆయా గ్రామాల్లో శుక్రవారం మహాసభలను నిర్వహించారు. దుర్శేడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎండీ ఖాజామొయినోద్దిన్ పాల్గొని గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్యాధికారి రాజేశ్, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: పట్టణంలో పోషన్ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. బాలల పరిరక్షణ కమిటీ మెంబర్ శోభరాణి, సీడీపీవో సుగుణ, డీసీ నాగరాజు, బీసీ నాగరాజు, ఐటీ ప్రవీణ్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలోని బాలికల గురుకుల కళాశాలలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాహారం, రక్తహీనత, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, సెల్‌ఫోన్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి, ఏసీడీపీవో నర్సింగవాణి, సూపర్ వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామపరిధిలోని నడింపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న సేవలను ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్ కవిత పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుధారాణి చిన్నారుల తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ అరుణ, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్ అంగన్‌వాడీ కేద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సీడీపీవో ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఎంపీడీవో ప్రభ పాల్గొన్నారు.

నేటి నుంచి రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న మంచినీటికి సంబంధించిన లోలెవల్ 350హెచ్‌పీ పంపు హౌస్‌లో ప్యానల్ బోర్డులో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడినందున ఈ నెల 14 నుంచి నగరంలో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా ఉంటుందని నగరపాలక సంస్థ ఎస్ఈ తెలిపారు. లో లెవల్ పరిధిలోని రాంపూర్, భగత్‌నగర్, మార్కెట్, హౌసింగ్ బోర్డు రిజర్వాయర్ల పరిధిలో రోజు విడిచి రోజు సరఫరా జరుగుతుందని తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్13:గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న కరీంనగర్ రూరల్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారం ముగిసాయి. చివరి రోజున అండర్14,17 విభాగాల్లో బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హాజరై ప్రారంభించారు. జిల్లా స్థాయికి ఎంపికైన 144మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందిస్తానని హామీ ఇచ్చారు.

'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఎంపిక

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్13: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. కార్యదర్శి పద్మ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్‌గౌడ్, గాజుల అంజయ్య ఉన్నారు.

ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

గణేశ్‌నగర్, సెప్టెంబర్ 13: బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జన్మదినం పురస్కరించుకొని తెలంగాణ చౌక్‌లో బీసీ సంఘం నాయకులు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజ్,బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం,బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన బీజేపీ శ్రేణులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 13: నగరంలోని 32వ డివిజన్‌లో అసంపూర్తిగా వదిలి పెట్టిన రోడ్లు వర్షాలకు మరింత దెబ్బతినడంతో శుక్రవారం డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకురాలు బండారి గాయత్రీ దేవి ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వంత ఖర్చులతో గణేశ్ నిమజ్జనం కోసం రోడ్లపై మట్టి పోసి చదను చేశామని తెలిపారు. ఇప్పటికైనా రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడూరి కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్, ఆదిత్య, అభిలాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

భగత్‌నగర్, సెప్టెంబరు 13: సీతారాం ఏచూరి మరణం దేశప్రజలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శుక్రవారం ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో జెండాను అవతనం చేసి ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, సత్యం బీమా సాహెబ్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, నరేష్, జిందం ప్రసాద్, జి తిరుపతి పాల్గొన్నారు.

● భగత్‌నగర్: సీతారాం ఏచూరి మృతికి నగరంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సంతాపం ప్రకటించారు.

● భగత్‌నగర్: సీతారాం ఏచూరికి ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ డివి జన్ నాయకులు నివాళులు అర్పించా రు. డివిజన్ అధ్య క్షుడు రాంమోహన్‌రావు, వామన్‌రావు, సూర్యకళ పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో సీతారాం ఏచూరికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెల్మారెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో యుగంధర్, తిరుపతి, రాజిరెడ్డి, అయిలయ్య, సమ్మ య్య, రాజు, కుమార్,రవి, సమ్మయ్య, మొగిలి, శివ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

ఇల్లందకుంట: ఎస్టీయూ ఇల్లందకుంట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా కందుల రవి, భూక్య రవీంద్రనాయక్, జిల్లా కౌన్సిలర్లుగా సానకిషన్, అంబాల రామలక్ష్మిను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎండీ రజాక్‌పాషా, జిల్లా పరిశీలకులు కోట శ్యాంకుమార్ తెలిపారు.

శంకరపట్నం: మండల పరిధిలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలకు సర్వే చేసి ప్రభుత్వం వెంటనే స్వాధీన పరుచుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బ్రాహ్మణపల్లి యుగంధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ ఫౌండేషన్ సిబ్బంది 570 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆలయ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నటరాజ్, సభ్యులుగా రాహుల్, సురేష్, దొరై రాజు, రాకేష్, మహేష్, సంతోష్, రాజు, రమేష్, నాగభూషణంలను ఎన్నుకున్నారు.

గంగాధర: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ముగిశాయి. అండర్-14 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు శ్రీనివాస్ తెలిపారు.